6 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 22 జూన్ 2024
www.ntnews.com



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# కేసీఆర్ పాలన... ప్రగతి తెలంగాణ

## బ్రిటిష్ వీక్లీ 'ది ఎకానమిస్ట్' పత్రిక ప్రశంసం



ఎడిటోరియల్ డెస్క్

కొత్త రాష్ట్రమైనప్పటికీ పదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. దేశంలో మరిన్ని కొత్త రాష్ర్టాల ఏర్పాటుకు ఓ సక్సెస్‌ఫుల్ మాడల్‌గా తెలంగాణ నిలిచింది. కేసీఆర్ ప్రగతిశీల పాలనలో చిన్న రాష్ట్రమైనప్పటికీ అన్ని రంగాల్లో తెలంగాణ ఉరకలేసింది. తలసరి ఆదాయం, జీఎస్డీపీ, స్థాపిత విద్యుత్తు సామర్థ్యం, ఐటీ ఉద్యోగాలు-ఎగుమతులు ఇలా పలు అంశాల్లో గడిచిన పదేండ్లలో తెలంగాణ ఎంతో ప్రగతి సాధించింది. ఇది వరో చెప్పిన మాట కాదు. 180 ఏండ్ల నుంచి నిరంతరాయంగా ప్రచురణలు కొనసాగిస్తూ.. ప్రపంచ ప్రఖ్యాత పత్రికల్లో అగ్రస్థానంలో నిలిచిన బ్రిటిష్ వీక్లీ మ్యాగజీన్ 'ది ఎకానమిస్ట్' తేల్చిచెప్పిన వాస్తవం.

కేసీఆర్ పాలనలో పదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని 'ది ఎకానమిస్ట్' తన కథనంలో వెల్లడించింది. కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో రాష్ట్రం

> ***తెలంగాణ తలసరి ఆదాయం ఇలా..:*** *2014లో తలసరి ఆదాయం రూ. 93,151గా ఉంటే, 2023 నాటికి రూ. 3,12,398 చేరుకున్నది. అంటే 235 శాతం పెరిగింది.*

> ***పదేండ్లలో తెలంగాణ జీఎస్డీపీ పెరిగిందిలా..:*** *2014లో జీఎస్డీపీ రూ. 3.79 లక్షల కోట్లు ఉంటే అది 2023 నాటికి రూ. 13.28 లక్షల కోట్లు అయింది. అంటే 251 శాతం పెరిగింది.*

పురోభివృద్ధి సాధించినట్టు వెల్లడించింది. తలసరి ఆదాయం, జీఎస్డీపీ, స్థాపిత విద్యుత్తు సామర్థ్యం, ఐటీ ఉద్యోగాలు-ఎగుమతులు ఇలా పలు అంశాల్లో గడిచిన పదేండ్లలో తెలంగాణ సాధించిన ప్రగతిని కొనియాడింది. దేశంలో మరిన్ని కొత్త రాష్ర్టాల ఏర్పాటుకు ఓ సక్సెస్‌ఫుల్ మాడల్‌గా తెలంగాణ నిలిచిందని ప్రశంసించింది. చిన్న రాష్ర్టాల ఏర్పాటుతో పెద్ద లాభాలు కలుగుతాయనే వాదనకు నిలువెత్తు నిరూపణే తెలంగాణగా అభివర్ణించింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ కృషిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'ది ఎకానమిస్ట్' ఏయే రంగాలపై ఏం వ్యాఖ్యానించింది? ఆయా రంగాల్లో జరిగిన అభివృద్ధి ఏమిటో సమగ్రంగా విశ్లేషిద్దాం.

**జీడీపీ-తలసరిపై 'ది ఎకానమిస్ట్' ఏమన్నదంటే..?:** దశాబ్దం కిందట 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. అప్పుడు జనాభా పరంగా దేశంలో తెలంగాణది 12వ స్థానం. విస్తీర్ణంపరంగా 11వ స్థానం, తలసరి ఆదాయంపరంగా 10వ ర్యాంకు. అయితే, కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో విశేష ప్రగతిని సాధించింది. తలసరి ఆదాయంలో దశాబ్దం కిందట పదో స్థానంలో ఉన్న తెలంగాణ.. 2023 నాటికి దేశంలోనే అగ్రస్థానానికి ఎగబాకింది. అంతేకాదు, దేశ జనాభాలో 2.7 శాతం మాత్రమే వాటా కలిగిన ఈ రాష్ట్రం జీడీపీలో 4.9 శాతం వాటాను కలిగి ఉన్నది. కొత్త రాష్ట్రమైనప్పటికీ పదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది.


Here's a model



### దేశ జీడీపీ-తెలంగాణ జీఎస్డీపీ (రూ. కోట్లలో)

| సంవత్సరం | తెలంగాణ జీఎస్డీపీ | దేశ జీడీపీ | జీడీపీలో తెలంగాణ వాటా (శాతాల్లో) |
|---|---|---|---|
| 2013-14 | 3,79,000 | 1,12,33,511 | 3.37 |
| 2014-15 | 5,05,849 | 1,24,67,959 | 4.05 |
| 2015-16 | 5,77,902 | 1,37,71,874 | 4.19 |
| 2016-17 | 6,58,325 | 1,53,91,669 | 4.27 |
| 2017-18 | 7,50,050 | 1,70,90,042 | 4.38 |
| 2018-19 | 8,57,427 | 1,88,99,668 | 4.53 |
| 2019-20 | 9,48,356 | 2,00,74,856 | 4.72 |
| 2020-21 | 9,69,656 | 1,98,00,914 | 4.89 |
| 2021-22 | 11,54,846 | 2,36,64,639 | 4.88 |
| 2022-23 | 13,28,000 | 2,72,03,767 | 4.89 |

**స్థాపిత విద్యుత్తు సామర్థ్యంపై...:** తెలంగాణ ప్రాంతానికి ఏండ్ల తరబడి సమస్యలుగా మారిన విద్యుత్తు, నీళ్లు, నిధులపై అధికారంలోకి రాగానే కేసీఆర్ దృష్టి సారించారు. విద్యుదుత్పత్తిలో స్వావలంబన సాధించాలన్న ఉద్దేశంతో స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు.

> ***స్థాపిత విద్యుత్తు సామర్థ్యం:*** *తెలంగాణ ఏర్పడిన నాటికి స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7.8 గిగావాట్లు మాత్రమే ఉండగా అది కేసీఆర్‌పాలనలో పదేండ్లలో 19.5 గిగావాట్లకు పెరిగింది.*

అలా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కేవలం 7,778 మెగావాట్లుగా (7.8 గిగావాట్లు) ఉన్న స్థాపిత విద్యుత్తు సామర్థ్యం.. కేసీఆర్ దూరదృష్టితో తొమ్మిదిన్నరేండ్లలోనే 150 శాతం వరకూ పెరిగి సుమారు 19,464 మెగావాట్ల (19.5 గిగావాట్ల)కు చేరుకున్నది.

**ఐటీ ఎగుమతులు, ఉద్యోగాలపై 'ది ఎకానమిస్ట్' ఏమన్నదంటే?:** కేసీఆర్ పాలనలో ఐటీరంగం గణనీయమైన ప్రగతి సాధించింది. 2014 నుంచి 2023 వరకు తొమ్మిదేండ్లలో ఐటీ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయి. తెలంగాణలో ఐటీ ఎగుమతుల విలువ ప్రస్తుతం 29 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. పదేండ్లలో ఐటీరంగంలో మూడు రెట్ల మేర ఉద్యోగాలు పెరిగి 9 లక్షలకు చేరాయి. రాజధాని హైదరాబాద్ ఐటీ హబ్‌గా మారింది. ఏటా లక్షలాది మంది ఈ నగరానికి ఉద్యోగాల కోసం క్యూ కడుతున్నారు. 1995-2004 మధ్య ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో సైబర్ టవర్ నిర్మించి ఐటీపై అవగాహన ఉన్న నేతగా పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం టెక్ వ్యూహాన్ని రెట్టింపు చేసింది. అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ పెట్టుబడులకు కేంద్రంగా మార్చుకున్నాయి.

**అనుమానాలు పటాపంచలు:** ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అభివృద్ధిపై తొలుత చాలా మంది అనుమానాలు వ్యక్తం చేశారని అయితే కేసీఆర్ తీసుకొచ్చిన విప్లవాత్మకమైన నూతన సంస్కరణలు రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశాయని 'ది ఎకానమిస్ట్' కథనంలో పేర్కొన్నది. ఆర్థిక స్థిరత్వం సాధించేందుకు, పరిశ్రమలు, ఇండ్ల అనుమతులు, ఇతర విషయాల్లో పారదర్శంగా ఉండేందుకు కేసీఆర్ సర్కారు ఆన్‌లైన్ విధానాలను తీసుకొచ్చినట్టు గుర్తుచేసింది. వ్యాపార అనుమతులకు సింగిల్ విండోలో అనుమతి ఇచ్చే పద్ధతిని తీసుకొచ్చి.. ఎక్కడా ఎలాంటి అవినీతికి తావులేకుండా, సమయం వృథా కాకుండా వెంటనే 15 రోజుల్లోనే అనుమతి వచ్చేలా ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది.

### తెలంగాణలో ఐటీ ఉద్యోగాలు ఇలా..

| సంవత్సరం | ఉద్యోగాలు |
|---|---|
| 2014-15 | 3,71,774 |
| 2015-16 | 4,07,385 |
| 2016-17 | 4,31,891 |
| 2017-18 | 4,75,308 |
| 2018-19 | 5,43,033 |
| 2019-20 | 5,82,126 |
| 2020-21 | 6,28,615 |
| 2021-22 | 7,78,121 |
| 2022-23 | 9,05,715 |

### పదేండ్లలో ఐటీ ఎగుమతుల విలువ

| సంవత్సరం | ఎగుమతులు (రూ. కోట్లలో) |
|---|---|
| 2014-15 | 66,276 |
| 2015-16 | 75,070 |
| 2016-17 | 85,470 |
| 2017-18 | 93,442 |
| 2018-19 | 1,09,219 |
| 2019-20 | 1,28,807 |
| 2020-21 | 1,45,552 |
| 2021-22 | 1,83,569 |
| 2022-23 | 2,41,275 |

> ***తొమ్మిదేండ్లలో ఐటీ అభివృద్ధి ఇలా...:*** *ఐటీ ఎగుమతులు 4 రెట్లు పెరిగి, 2023నాటికి ఐటీ ఎగుమతుల విలువ 29 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అదేవిధంగా ఈ పదేండ్లలో ఐటీ ఉద్యోగాల కల్పన 3 రెట్లు పెరిగి.. 2023 నాటికి ఐటీరంగంలో 9 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు లభించాయి.*

### కథనంలో 'ది ఎకానమిస్ట్' కీలక వ్యాఖ్యలు..

- కొత్త రాష్ట్రమైనప్పటికీ పదేండ్లలో తెలంగాణ అద్భు తమైన ప్రగతి సాధించింది.
- దేశంలో మరిన్ని కొత్త రాష్ర్టాల ఏర్పాటుకు ఓ సక్సెస్‌ఫుల్ మాడల్‌గా నిలిచింది.
- తెలంగాణ ఏర్పడిన నాటికి స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7.8 గిగావాట్లు మాత్రమే.
- కేసీఆర్ పాలనలో పదేండ్లలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 19.5 గిగావాట్లకు పెరిగింది.
- దేశ జనాభాలో 2.7 శాతం మాత్రమే వాటా కలిగిన తెలంగాణ.. జీడీపీలో మాత్రం అనూహ్యంగా 4.9 శాతం వాటాను కలిగి ఉన్నది.
- 2014 నుంచి 2023 వరకు తొమ్మిదేండ్లలో ఐటీ ఎగుమతులు 4 రెట్లు పెరిగాయి.
- తెలంగాణలో ఐటీ ఎగుమతుల విలువ ప్రస్తుతం 29 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.
- పదేండ్లలో ఐటీ రంగంలో ఉద్యోగాలు 3 రెట్లు పెరిగి 9 లక్షలకు చేరువయ్యాయి.

# ఉద్యమ దివిటీపై ఉన్మాద ప్రేలాపన



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

**అవును.. తెలంగాణ ఉద్యమ దివిటీ తన్నీరు హరీశ్‌రావు. ఆయనపై రెండు రోజుల కిందట 'అక్రమాలు, అబద్ధాలు కలిపితే హరీశ్‌రావు అవుతారు'.. అనే శీర్షికతో వ్యాసం అచ్చయింది. వ్యాసం ఆద్యంతం విధానపరమైన విమర్శలు కాకుండా వ్యక్తిగత విమర్శ, వ్యక్తిత్వ హననంకే పరిమితం కావడం విచారకరం, ఆక్షేపణీయం. రాజకీయాల్లో రాణించాలనుకునేవారు, ఒక ప్రతిపక్ష నేత, అందునా తెలంగాణ ఉద్యమ స్వరూపంలో కీలక భూమికను పోషించిన హరీశ్‌రావు లాంటి నాయకుడిపై చేసిన విమర్శ కూడా అర్థరహితంగా ఉన్నది.**

ఒక పత్రికలో ఈ నెల 20న 'హరీశ్ విష ప్రచారం వెనుక కుటిల తంత్రం' శీర్షికన ప్రచురితమైన వ్యాసాన్ని చూస్తే రచయిత డొల్లతనం కనిపిస్తుంది. విమర్శలు చేయడం ద్వారా స్థాయి పెంచుకోవాలని చేసే ప్రయత్నమే తప్ప సద్విమర్శలను పరిగణనలోకి తీసుకొని సరిదిద్దుకునే ఉద్దేశమేదీ లేదు. ఈ వ్యాసంలో వ్యక్తిత్వాల ప్రస్తావన వచ్చింది కాబట్టి హరీశ్‌రావు వ్యక్తిత్వం గురించి ఒక్కసారి చెప్పుకొందాం. తెలంగాణ సాధనలో కేసీఆర్ తర్వాత అంతగా ఉద్యమించిన వ్యక్తి హరీశ్ రావే. ఉద్యమంలో రెండోస్థానం ఆయనదేనన్నది శత్రువులు కూడా కాదనలేని వాస్తవం. ప్రజలతో ఆయనకున్న సన్నిహిత సంబంధాలే ఆయనను నాయకునిగా చేశాయి. మిస్డ్ కాల్‌ను కూడా చూసి తిరిగి ఫోన్ చేసి విషయాలను కనుక్కోవడం ఆయనకు అలవాటు. ఉద్యమం సమయంలోనే కాదు, ఏ పదవిలో ఉన్నా ఈ అలవాటును మానుకోలేదు. మరిచిపోలేదు. ప్రజల్లో విశ్వసనీయత, జవాబుదారీతనంతో ఉన్నారనేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ మంత్రిగా ఆయన అందించిన సేవలు, చూపించిన సామర్థ్యం అందరికీ తెలిసినవే.

విమర్శల విషయానికి వస్తే అవి వ్యక్తిగతమైనవో, రాజకీయమైనవో కావు విధానపరమైనవి. అవన్నీ సద్విమర్శలు, సూచనలు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని పదే పదే గుర్తు చేస్తున్నారే తప్ప అంతకు మించి ఇంకేమీ అనడం లేదు. చేసిందేమీ లేక, చెప్పుకోవడానికి ఏమీ లేని సమయాల్లోనే వ్యక్తిగత విమర్శలకు దిగుతారన్నది అందరికీ తెలిసిన సత్యం. ప్రస్తుతం జరుగుతున్నదిదే. 'ప్రతి చిన్న విషయానికీ స్పందిస్తూ నానా యాగీ చేస్తున్నారు' అని హరీశ్ రావును ఉద్దేశించి వ్యాస రచయిత విమర్శించారు. ప్రతి చిన్న విషయాన్నీ పట్టించుకుంటున్నారంటే పరిపాలనపై ఆయనకున్న పట్టు ఏమిటో అర్థమవుతున్నది. ప్రతి చిన్న విషయమూ ప్రజలపై ఎలా ప్రభావం చూపుతుందో ఆయనకు తెలుసు. అందుకే పాలనలోని లోపాలను ఆయన ఎత్తిచూపగలుగుతున్నారు. ప్రజలు ఇచ్చిన అధికారంతోనే ఆయన ప్రభుత్వ పాలనలోని లోటుపాట్లను వివరించగలుగుతున్నారు. ఈసారి ప్రతిపక్ష పాత్ర పోషించాలని ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదేశించారు. అందుకు అనుగుణంగానే ఆయన కార్యాచరణ ఉన్నది. అధికార కాంగ్రెస్‌కు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు ఓట్ల మధ్య ఉన్న తేడా కేవలం రెండు శాతంలోపే అని గుర్తించాలి. బీఆర్‌ఎస్‌కు ప్రజలు విపక్ష హోదా ఇచ్చారే తప్ప, రాజకీయరంగం నుంచి దూరం చేయలేదు. ఆ అధికారంతోనే ప్రభుత్వ పాలనలోని లోపాలను ఎత్తిచూపి, పరిష్కార మార్గాలు చెప్తుంటే అది తప్పుగా తోచడం విచిత్రం.

> **ఇంతకీ హరీశ్‌రావు ఏమడిగారు? అధికారంలోకి వచ్చి ఆరు నెలలైంది. హామీల అమలు ఎంతవరకు వచ్చిందని అడిగారు. ఆరు గ్యారెంటీల అమలుకు మొదటి మంత్రి వర్గం సమావేశంలోనే చట్టం తీసుకొని వస్తామన్నారు. తెచ్చారా? పథకాల లబ్ధికి తెల్లకార్డును అర్హతగా చెప్పున్నారు. మరి తెల్లకార్డుల జారీకి తీసుకున్న చర్యలు ఏమిటి? కనీసం మార్గదర్శకాలు ఇచ్చారా? ఇలా అడగడమే తప్పా?**

అర్హులందరికీ రేషన్‌కార్డులు అందాలంటే తొలుత పేదలెందరో తేలాలి. ఇది జరగాలంటే కులగణన చేపట్టాలి. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇదే విషయమై హామీ ఇచ్చారు కదా? ఆయన మాటైనా నిలబెట్టరా? దీనిపై కసరత్తు చేయడానికి ఆరు నెలలు సరిపోవా? రుణమాఫీ గురించి ఇప్పుడు ఎంతో కొంత కసరత్తు చేస్తున్నట్టు కనిపిస్తున్నా ఇంతవరకు కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయాలు తీసుకోలేదు.



రైతు ఉద్యమాల్లో దిట్ట అయిన కోదండరెడ్డి లాంటి వారి సలహాలు కూడా ఇంతవరకు తీసుకోలేదు. అందరితో సంప్రదింపులు జరిపితేనే ఇబ్బందులు లేకుండా పథకం అమల్లోకి వస్తుంది. హామీల సంగతిని కాసేపు పక్కనపెడదాం. పోనీ ఆచరణలో ఉన్న పథకాలనైనా సక్రమంగా అమలు చేస్తున్నారా? జూన్ నెల ముగుస్తున్నా రైతు భరోసా ఊసే లేదు. పొలం పనులు ప్రారంభించే సమయంలోనే రైతులకు విత్తనాలు, ఎరువులు, కూలీలకు చెల్లింపుల కోసం సొమ్ము అవసరం ఉంటుంది. చేతిలో పైసలు లేకపోతే అప్పు చేయకతప్పదు. ఈ దుస్థితి ఉండకూడదనే కేసీఆర్ సర్కారు సకాలంలో రైతు బంధు సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎవరి ప్రమేయం, అవినీతి లేకుండా నేరుగా సాయం అందింది. మరి ఈ వానాకాలంలో అదెందుకు జరగడం లేదు? దాహమేసినప్పుడే కదా గ్లాసుడు మంచి నీళ్లు అవసరం. తర్వాత ఎప్పుడో బిందెడు నీళ్లు ఇచ్చినా జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. నూతన విద్యా సంవత్సరం కూడా మొదలైంది. విద్య నిధులు, విదేశీ స్కాలర్‌షిప్‌ల సంగతి ఏమిటో ఎవరికీ తెలియదు.

పొరుగునే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మొదట చేసిన పని.. ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ల పెంపు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిగా అవగాహన రానప్పటికీ పెన్షన్లు పెంచుతూ ఆదేశాలు ఇచ్చారు. మరి ఇక్కడ సమస్య ఏమిటో? దీనిపై ఆత్మవిమర్శ మాని ఎదురుదాడి ఎందుకో?

> **తెలంగాణకు జీవనాడి, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సింగరేణి ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిపోతున్నా రేవంత్ ప్రభుత్వం మౌనంగా ఉండిపోతోంది. అసలు సింగరేణి ఏర్పాటైనదే ప్రభుత్వ రంగ సంస్థగా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందులో భాగస్వాములు. ఇదొక ప్రత్యేక పరిస్థితి. తెలంగాణలోనే కాదు.. ఆంధ్రాలోని జంగారెడ్డిగూడెం ప్రాంతంలో ఉన్న బొగ్గు గనులు కూడా దాని పరిధిలోకి వస్తాయి. తెలంగాణ ఏర్పాటు సమయంలో ఇదే సంగతిని చెప్పారు. వీటన్నింటిని విస్మరించి ప్రైవేటు సంస్థలకు అప్పగించడానికి గనులను కేంద్రం వేలం వేస్తుంటే తగిన స్పందన ఏదీ?**

ఇలా ఎటు చూసినా వైఫల్యాలే. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు నెలల్లో ఏమి సాధించిందంటే చెప్పలేని పరిస్థితి. అన్నీ అసంబద్ధ నిర్ణయాలే. శాంతిభద్రతల్లో ఫెయిల్యూర్. రేవంత్ సర్కార్ కొలువుదీరిన 6 నెలల్లో ఏ ఒక్క ప్రజాప్రయోజనం జరగలేదన్నది వాస్తవం. పాలనపై పట్టు లేకపోవడంతో పాటు అనుభవం లేక సీఎం రేవంత్ అబాసుపాలు కావడం లేదా? పాలనపై దృష్టి సారించే బదులు ఉన్న సమయమంతా పార్టీ ఫిరాయింపులపై దృష్టి పెట్టడం లేదా? ముఖ్యమంత్రికి మంత్రులపై పట్టు ఉందా? అధికారులపై అజమాయిషీ ఉన్నదా? ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత ఉన్నదా? ఏ మంత్రి అయినా ముఖ్యమంత్రికి జవాబు దారీతనంగా పనిచేస్తున్నారా? అంతెందుకు గెలిచిన 65 మంది ఎమ్మెల్యేలలో సీఎం మొహాన్ని చూడని వారు ఎందరు? ఇలా చెప్పుకుంటూ పోతే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలల పాలన వైఫల్యాలు కోకొల్లలు. ఈ అంశాల నుంచి దృష్టి మళ్లించడానికే ఉద్యమ దివిటీ లాంటి హరీశ్‌రావుపై ఉత్తుత్తి ఆరోపణలు. అంతేకాదు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో, పదేండ్ల పాలనలో హరీశ్ మార్కును ఎవరు కాదనలేరన్నది జగమెరిగిన సత్యం.

(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు)

> **ఇలా ఎటు చూసినా వైఫల్యాలే. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు నెలల్లో ఏమి సాధించిందంటే చెప్పలేని పరిస్థితి. అన్నీ అసంబద్ధ నిర్ణయాలే. శాంతిభద్రతల్లో ఫెయిల్యూర్. రేవంత్ సర్కార్ కొలువుదీరిన 6 నెలల్లో ఏ ఒక్క ప్రజాప్రయోజనం జరగలేదన్నది వాస్తవం. పాలనపై పట్టు లేకపోవడంతో పాటు అనుభవం లేక సీఎం రేవంత్ అబాసుపాలు కావడం లేదా? పాలనపై దృష్టి సారించే బదులు ఉన్న సమయమంతా పార్టీ ఫిరాయింపులపై దృష్టి పెట్టడం లేదా? ముఖ్యమంత్రికి మంత్రులపై పట్టు ఉందా? అధికారులపై అజమాయిషీ ఉన్నదా? ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత ఉన్నదా? ఏ మంత్రి అయినా కూడా ముఖ్యమంత్రికి జవాబు దారీతనంగా పనిచేస్తున్నారా?**

## ఎటమటం



### చెవిలో చెబుతా!

*ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పులిలా ఉన్న జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పిల్లిలా మారిపోయారు. అలా ఎందుకయ్యారని ఆయనను మీడియా ప్రశ్నించగా.. '2021లో రాహుల్‌గాంధీ నా నుంచి మాట తీసుకున్నారు. ఏదైనా ఉంటే నా చెవిలో చెప్పు.. అంతేకానీ మీడియాకు ఎక్కొద్దని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటున్నా' అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లోకి వచ్చే ఎమ్మెల్యేలు ఎవరైనా ఉన్నారా? అని గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా ప్రశ్నించగా.. 'ఆ విషయాలు సీఎం చూసుకుంటారు. నాకు తెలిసినా మీకెందుకు చెబుతా? రాహుల్‌గాంధీకి చెవిలో చెబుతా' నంటూ దాటవేశారు.*



### కాదేది కరెంట్ కట్‌కు అనర్హం...

*'కుక్క పిల్లా.. సబ్బుబిళ్లా.. అగ్గి పుల్లా కాదేదీ కవితకనర్హం' అన్న శ్రీశ్రీ మాటలను కరెంటోళ్లు అక్షరాల పాటిస్తున్నారు. 'మా కాలనీలో కరెంట్ పోయింద'ని ఎవరైనా ఫోన్ చేస్తే.. వైర్ల మీద తొండ పడిందని, ట్రాన్స్‌ఫార్మర్‌లో బల్లి ఇరుక్కుపోయిందని విచిత్రమైన సాకులు చెప్తున్నారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో జైల్లో ఉన్న రాధాకిషన్‌రావుకు పిల్లి కరవడంతో తీవ్ర రక్తస్రావం అయినట్టు మీడియాకు ఉప్పందింది. దీంతో 'అధికారులు వేటినీ వదలిపెట్టడం లేదు, చివరికి తొండలు, పిల్లులు, బల్లులనూ బలి పశువులను చేస్తున్నారు పాపం' అని సెటైర్లు వేస్తున్నారు.*



### తల్లికి అన్నం పెట్టనోడు.. చిన్నమ్మకు..

*కన్నతల్లికి అన్నం పెట్టనోడు పినతల్లికి బంగారు గాజులు చేయిస్తానన్నట్టు ఉంది తెలంగాణ కమలనాథుల వైఖరి. తెలంగాణకు విభజన చట్టంలో చట్టబద్ధంగా కేంద్రం ఇచ్చిన హామీలపై ఏనాడూ నోరు మెదపని బండి సంజయ్.. హైదరాబాద్‌లోని భాగ్యలక్ష్మి ఆలయాన్ని 'గోల్డెన్ టెంపుల్'గా మారుస్తానని చెప్పడం కూడా అచ్చం అలాగే ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.*



### లీకులపై అధికార ప్రతినిధులు...

*అధికార ప్రతినిధుల ద్వారా రాజకీయ పార్టీలు.. సమాచార, పౌరసంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వాలు ప్రజలకు అధికారిక సమాచారం ఇవ్వడం ఆనవాయితీ. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రభుత్వ లీకులపై అధికారికంగా వివరణ ఇచ్చేందుకు ఏకంగా ఇద్దరు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం మాత్రం విడ్డూరం.*

**- వెల్జాల**